


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

19వ వసంతంలోకి ...

ఎన్టీఆర్ కృష్ణా

గురువారం 13 నవంబర్ 2025 పేజీలు 8


# అజిత్ సింగ్ నగర్ పోలీస్ స్టేషనా మజాకానా




- డబ్బునోడికి ఒకలా.. సామాన్యులకు మరోలా.. ట్రీట్మెంట్
- రాత్రి 11 గంటలకు దుకాణాలు క్లోజ్.. కానీ డబ్బులిస్తే తెల్లార్లూ అనుమతులు
- బాక్స్ క్రికెట్ లో 24 గంటలు ఆటలా....
- సీపీ క్లాస్ తీసుకున్నా అజిత్ సింగ్ నగర్ పోలీసుల్లో మార్పు రాదా?

"అజిత్ సింగ్ నగర్ పోలీస్ స్టేషన్ నిత్యం వివాదాలకు కేరాఫ్ గా నిలుస్తోంది. ఈ స్టేషన్‌లో డబ్బున్నోళ్ళను ఒకలా డబ్బులేనోళ్ళను మరోళా ట్రీట్ చేస్తుంటారని ప్రచారం జరుగుతోంది. అలాగే రాత్రి 11 గంటలకు మూయాల్సిన దుకాణాలు, క్రీడామైదానాలు తెల్లార్లు నడవడం వెనకాల కూడా స్టేషన్‌లో పోలీసుల సపోర్ట్ ఉందనే ప్రచారం జరుగుతోంది."

వివరాలు 2లో

## భవన నిర్మాణానికి అనుమతి కచ్చితంగా ఉండాలి

**అనధికార నిర్మాణాలను గుర్తించి తొలగించే కార్యక్రమం కొనసాగుతోంది..**

**వీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్**

విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ : భవన నిర్మాణానికి అనుమతి కచ్చితంగా ఉండాలని విజయవాడ నగరపాలక సంస్థ చీఫ్ సిటీ ప్లానర్ కె. సంజయ్ రత్న కుమార్ అన్నారు. బుధవారం ఉదయం చీఫ్ సిటీ ప్లానర్ ఆదేశాల మేరకు, 2



## జిల్లాలో పేదలందరూ సొంతింటి కల నిజం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



వివరాలు 2లో...

## పండగ వాతావరణంలో గృహ ప్రవేశాలు

2

జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ, శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్



# తీరని మంచినీటి కష్టాలు..!

**వత్సవాయి గ్రామ ప్రజలకు తాగునీటికి మోక్షం ఎప్పుడో...?**

**బోరు నీళ్లు (మినరల్ వాటర్) తాగటంతో ఎముకల రోగాల బారినపడుతున్న ప్రజలు**

**ప్రభుత్వాలు మారిన ప్రజల తాగునీటి కష్టాలు మారవా..?**

**గ్రామపంచాయతీ ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల తీరుపై పలు విమర్శలు!**



**వత్సవాయి నవంబర్ 12 మేజర్ న్యూస్ :** జగ్గయ్యపేట నియోజకవర్గంలో వత్సవాయి మండలంలో వత్సవాయి గ్రామం మేజర్ గ్రామపంచాయతీ. ఈ గ్రామానికి కూత వేటు దూరంలో మునేరు ఉన్నది ఈ మునేటి నుంచి గ్రామపంచాయతీకి మంచినీటి సరఫరా సౌకర్యం ఉంది. గత నెల కురిసిన మొంథా తుఫాన్ వలన లింగాల బ్రిడ్జిపై ఉన్న మంచినీటి సరఫరా పైపులైన్లు ధ్వంసం అయ్యి సుమారు 15 రోజులు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు మరమత్తులు పనులు చేపట్టకపోవడం వలన గ్రామ ప్రజలకు మంచినీటి కష్టాలు ఎప్పుడు తీరుతాయో అని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇటు అధికారులు అటు ప్రజాప్రతినిధులు మంచినీటి సౌకర్యాన్ని ప్రజలకు అందించడంలో విఫలం అవుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.మేజర్ గ్రామపంచాయతీకే మంచినీటి సౌకర్యం సరిగా లేదు అంటే మారుమూల గ్రామాల పరిస్థితిని ఉన్నతాధికారులే అర్థం చేసుకోవాలి. మంచినీటి సరఫరా కోసం ఆర్డబ్ల్యూఎస్ మిగతా 2లో...

# ఐక్యూ 15 ప్రీ-బుకింగ్ నవంబర్ 20 నుంచి ప్రారంభం




**విజయవాడ, నవంబర్ 12, మేజర్ న్యూస్ :** హై-పర్ఫార్మెన్స్ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ ఐక్యూ, తన తాజా ఫ్లాగ్‌షిప్ ఐక్యూ 15 ను నవంబర్ 26న భారత మార్కెట్‌లో విడుదల చేయనుంది. ప్రీమియం పని తీరు, ఆధునిక కెమెరా, సాఫ్ట్‌వేర్, ఏఐ సామర్థ్యాలు, దీర్ఘకాలిక బ్యాటరీ లైఫ్‌తో ఈ ఫోన్ కొత్త ప్రమాణాలను సృష్టించబోతోంది.ప్రీ-బుకింగ్ నవంబర్ 20 నుంచి ప్రారంభమవుతుంది. కస్టమర్లు రూ.1000 రిఫండబుల్ అమౌంట్ చెల్లించి ప్రయారిటీ పాస్ పొందవచ్చు. దీని ద్వారా ఉచిత ఐక్యూ టీడబ్ల్యుఎస్ 1ఈ ఇయర్‌బడ్స్, 12 నెలల అదనపు వారంటీ వంటి ప్రత్యేక ప్రయోజనాలు లభిస్తాయి. పరిమిత సంఖ్యలో పాస్‌లు మాత్రమే అందుబాటులో ఉంటాయి. డిస్‌ప్లే పరంగా ఐక్యూ 15లో శామ్‌సాంగ్ 2కే ఎం14 ఎల్ఈడీ, ఓఎల్ఈడీ డిస్‌ప్లేను ఉపయోగించారు. ఇది ఆండ్రాయిడ్ ఫోన్లలో తొలిసారి. ఇది 2కే రిజల్యూషన్, 144హెర్ట్జ్ అడాప్టివ్ రిఫ్రెష్ రేట్, 6000 నిట్స్ లోకల్ పీక్ బ్రైట్‌నెస్‌తో భారతదేశంలోనే అత్యంత ప్రకాశవంతమైన డిస్‌ప్లేగా నిలుస్తోంది. డాల్బీ విజన్, ట్రిపుల్ అంబియంట్ లైట్ సెన్సర్లు మరింత సహజమైన, లైవ్ విజువల్ అనుభవాన్ని అందిస్తాయి. పర్ఫార్మెన్స్ పరంగా ఈ ఫోన్‌లో స్నాప్ డ్రాగన్ 8 ఎలైట్ జెన్ 5 ప్రాసెసర్ ఉంది. ఆండ్రాయిడ్ 16 ఆధారిత ఆరిజన్‌ఓఎస్ 6తో పని చేసే ఇది 4 మిలియన్ కంటే ఎక్కువ స్కోర్ సాధించింది. 5 ఏళ్ల ఓఎస్ అప్‌డేట్‌లు, ఏడేళ్ల సెక్యూరిటీ సపోర్ట్‌తో ఇది ఐక్యూ అత్యంత ఫ్యూచర్-రెడీ ఫోన్‌గా నిలుస్తోంది. సూపర్ కంప్యూటింగ్ చిప్ క్యూ3. 8కే వీసీ కూలింగ్ సిస్టమ్ రే ట్రేసింగ్ టెక్నాలజీ వంటి ఫీచర్లు గేమింగ్‌ను మరింత రియలిస్టిక్‌గా చేస్తాయి. కెమెరా విభాగంలో, ఇది 50ఎంపీ ట్రిపుల్ కెమెరా సిస్టమ్ (సోనీ ఐఎంఎక్స్ సోనీ921 మెయిన్ సెన్సార్, 50ఎంపీ పెరిస్కోప్ టెలిఫోటో, 50పీ అల్ట్రా వైడ్), 32ఎంపీ ఫ్రంట్ కెమెరాతో వస్తుంది. పవర్ పరంగా, 7000ఎంఏహెచ్ బ్యాటరీ, 100డబ్ల్యు ఫ్లాష్ ఛార్జ్, 40డబ్ల్యు వైర్‌లెస్ ఛార్జింగ్ సపోర్ట్ లభిస్తుంది.ఈ ఫోన్ రెండు వేరియంట్లలో అందుబాటులో ఉంటుంది. ఆల్ఫా ఎడిషన్ (మ్యాట్ బ్లాక్), లెజెండ్ ఎడిషన్ (వైట్, ట్రై-కలర్ లోగోతో). ఐక్యూ15 స్టైల్, స్మార్ట్ టెక్నాలజీని సమపాళ్లలో కలిపిన కొత్త తరహా ఫ్లాగ్‌షిప్!

## బజాజ్ జనరల్ ఇన్సూరెన్స్ లిమిటెడ్

# రూ.25 కోట్ల మోటార్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ మోసాన్ని బయటపెట్టింది

**విజయవాడ, నవంబర్ 12, మేజర్ న్యూస్ :** భారతదేశంలోని ప్రముఖ ప్రైవేట్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలలో ఒకటైన బజాజ్ జనరల్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ (గతంలో బజాజ్ అలియంజ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్), కల్పించిన థర్డ్-పార్టీ పరిహారం క్లెయిమ్ ఆధారంగా ?25 కోట్ల మోటార్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ మోసాన్ని విజయవంతంగా బయటపెట్టింది. భుజ్‌లోని మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ (ఎంఏసిటి)కు సమర్పించిన తప్పుడు ఎఫ్ఐఆర్, తప్పుదోవ పట్టించే డాక్యుమెంటేషన్ ద్వారా ఈ మోసం జరిగింది. ఈ కేసు సనంద్ పోలీస్ స్టేషన్‌లో భారత శిక్షాస్మృతి, మోటారు వాహనాల చట్టం కింద నమోదైన ఎఫ్ఐఆర్ నుండి ఉద్భవించింది. మహీంద్రా జైలో కారు నడుపుతున్నప్పుడు అకస్మాత్తుగా రోడ్డుపై ఒక కుక్క కనిపించిందని, దీంతో వాహనం బోల్తా పడిందని ఆరోపించిన డ్రైవర్ ఫిర్యాదు చేశారు. తన పక్కన కూర్చున్న సహ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు అయ్యాయని, సనంద్ ప్రభుత్వ ఆసుపత్రిలో మరణించినట్లు ప్రకటించారని ఆయన ఆరోపించారు. దీని తరువాత, మరణించిన వారి చట్టపరమైన వారసులు భుజ్‌లోని ఎంఏసిటి ముందు ?25 కోట్ల పరిహార దావాను దాఖలు చేశారు. బజాజ్ జనరల్ ఇన్సూరెన్స్ కోర్టు నోటీసులను అందుకుంది, అంతర్గత దర్యాప్తును ప్రారంభించింది. కంపెనీ ఎఫ్ఐఆర్, ఛార్జ్‌షీట్, పోస్ట్-మార్టమ్ రిపోర్ట్, స్పాట్, ఇన్‌క్వెస్ట్ పంచనామాలు, వాహన డాక్యుమెంట్లను పొందింది. కంపెనీ ఎఫ్ఐఆర్, సపోర్టింగ్ డాక్యుమెంట్లను అనుమానాస్పదంగా కనుగొంది, మోసం చేయడానికి ముందస్తుగా చేసిన ప్రయత్నాన్ని సూచిస్తున్నట్లుగా కనుగొంది. న్యాయపరమైన జోక్యం అవసరాన్ని గుర్తించి, బజాజ్ జనరల్ ఇన్సూరెన్స్ గౌరవనీయమైన గుజరాత్ హైకోర్టు ముందు ఒక పిటిషన్ దాఖలు చేసింది. కోర్టు తన తీర్పులో, ఈ ప్రమాదం ప్రాథమికంగా అనుమానాస్పదంగా ఉందని గమనించి, ఈ విషయాన్ని తిరిగి దర్యాప్తు చేయడానికి సిఐడి క్రైమ్ బ్రాంచ్‌లో ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (ఎస్ఐటి) నియమించింది. ఎస్ఐటి రిపోర్ట్ వచ్చే వరకు మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ పిటిషన్‌లోని అన్ని చర్యలు నిలిపివేయబడ్డాయి. గుజరాత్ రాష్ట్రంలోని అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, సిఐడి క్రైమ్ అండ్ రైల్వేస్ నేతృత్వంలో ఎస్ఐటి తన ఫలితాలను సమర్పించింది. యాక్సిడెంట్ సమయంలో సహ-డ్రైవర్ నిజంగా వాహనాన్ని ఒంటరిగా నడుపుతున్నారని దర్యాప్తు ధృవీకరించబడింది. ఆరోపించిన డ్రైవర్ ఉద్దేశపూర్వకంగానే తప్పుడు ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు, సాక్షులను తప్పుదారి పట్టించారు, మోసపూరిత వాదనకు మద్దతుగా కల్పిత ఆధారాలను సమర్పించారు. గతంలో క్లెయిమ్ తిరస్కరించబడినప్పటికీ, ఇన్సూరెన్స్ చేయబడిన వాహన యజమాని కూడా మెహ్సానాలోని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ముందు రెగ్యులర్ డ్యామేజ్ ఇతరాల ద్వారా సొంత నష్ట పరిహారాన్ని క్లెయిమ్ చేయడానికి ప్రయత్నించారు. ధృవీకరించబడిన సాక్ష్యాల మద్దతుతో, బజాజ్ జనరల్ ఇన్సూరెన్స్ కుట్ర, సాక్ష్యాలను కల్పించడం, మోసానికి ప్రయత్నించినందుకు ఆరోపించబడిన డ్రైవర్, ఇన్సూర్ చేయబడిన వ్యక్తి ఇద్దరిపై సనంద్ పోలీస్ స్టేషన్‌లో ఒక ఎఫ్ఐఆర్ దాఖలు చేసింది. బజాజ్ జనరల్ ఇన్సూరెన్స్ ఇన్సూరెన్స్ మోసంపై ఏ విధమైన సహనాన్ని చూపదనే తన దృఢమైన నిబద్ధతతో ఉంది. మోసపూరిత కార్యకలాపాలను గుర్తించడానికి, దర్యాప్తు చేయడానికి, వాటికి వ్యతిరేకంగా నిర్ణయాత్మక చర్య తీసుకోవడానికి కంపెనీ పూర్తిగా కట్టుబడి ఉంది. పాలసీదారులందరూ జాగ్రత్తగా ఉండాలని, ఏవైనా అనుమానాస్పద ప్రవర్తనను వెంటనే నివేదించాలని ఇది కోరుతుంది. ఇన్సూరెన్స్ మోసం వ్యాపారాలకు మాత్రమే కాకుండా నిజాయితీ గల కస్టమర్లు, విస్తృత సమాజానికి కూడా హాని కలిగిస్తుంది. బ్యాక్‌గ్రౌండ్‌తో సంబంధం లేకుండా ఎవరైనా మోసంలో పాల్గొనవచ్చు అని ఈ కేసు హైలైట్ చేస్తుంది. న్యాయం జరిగేలా చూసుకోవడానికి బజాజ్ జనరల్ ఇన్సూరెన్స్ న్యాయపరమైన సంస్థలు, కోర్టులతో పనిచేస్తూనే ఉంటుంది.

# శ్రీరామిరెడ్డి మరణం బాధాకరం

## ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ



**గన్నవరం, నవంబర్ 12, మేజర్ న్యూస్ :** నమ్మిన వారి కోసం కడవరకు పోరాడే మనస్తత్వం ఉన్న శ్రీరామిరెడ్డి మృతి తనను తీవ్రంగా బాధించిందని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. గన్నవరం మండలం వీరపనేనిగూడెం గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు ఉయ్యూరు శ్రీరామ్ రెడ్డి(94) మంగళవారం రాత్రి మృతిచెందగా, బుధవారం ఉదయం వీరపనేనిగూడెం గ్రామానికి చేరుకుని శ్రీరామ్ రెడ్డి మృతదేహాన్ని సందర్శించిన యార్లగడ్డ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ రెడ్డితో తన గల అనుబంధాన్ని యార్లగడ్డ గుర్తు చేసుకున్నారు. శ్రీరామ్ రెడ్డి 2017 నుంచి తన వెంటే నడుస్తున్నారని యార్లగడ్డ తెలిపారు. పాలకేంద్ర అధ్యక్షుడుగా పనిచేస్తున్న శ్రీరామ్ రెడ్డి పదవి పోయినా బాధపడకుండా తనను ఎమ్మెల్యేగా చూడాలన్న ఏకైక లక్ష్యంతో తనతోపాటు పార్టీ మారారని యార్లగడ్డ పేర్కొన్నారు. గత 60 ఏళ్లుగా రాజకీయాల్లో చురుగ్గా ఉన్న ఆయన 92 ఏళ్ళ వయసులో తన కోసం పార్టీ మారి గత ఎన్నికల్లో తన గెలుపు కోసం కష్టపడి పని చేసిన శ్రీరామ్ రెడ్డి లాంటి మంచి నాయకుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. శ్రీరామ్ రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన యార్లగడ్డ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి, నాదెండ్ల మోహన్, వెంకటకృష్ణ, టీడీపీ నాయకులు కాగితాల నాగరాజు, బసంత్, షేక్ అమీర్, పుల్లారెడ్డి, నరేంద్రారెడ్డి పాల్గొన్నారు.



## శీలం రాధకు నివాళులర్పించిన వర్ల, వీరంకి

**తొట్లవల్లూరు మేజర్ న్యూస్:** మండల పరిధిలోని గరికపర్రు గ్రామంలో శీలం నాగరాజు తండ్రి రాధ పెదకర్మ కార్యక్రమం బుధవారం నిర్వహించగా ఈ కార్యక్రమంలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా, రాష్ట్ర గౌడ సంక్షేమ- అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాధ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరపనేని శివరామ ప్రసాద్, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## గృహోపకరణాలకూ శాంసంగ్ కేర్ ప్లస్ సేవలు

**విజయవాడ, నవంబర్ 12, మేజర్ న్యూస్ :** భారతదేశపు అగ్రగామి కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శాంసంగ్, తమ 'శాంసంగ్ కేర్ ప్లస్' సేవను విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, ఎయిర్ కండిషనర్లు, మైక్రోవేవ్ ఓవెన్లు, స్మార్ట్ టీవీల వంటి గృహోపకరణాల కోసం ఎక్స్‌టెండెడ్ వారంటీ ప్లాన్లను అందిస్తోంది. కస్టమర్లు ఇప్పుడు 1 నుండి 4 సంవత్సరాల వరకు ప్లాన్లను ఎంచుకోవచ్చు. ఇవి సమగ్ర రక్షణ, సౌలభ్యాన్ని అందిస్తాయి. వీటి ధరలు రోజుకు కేవలం రూ. 2 నుండే ప్రారంభమవుతాయి. ఈ మెరుగైన శాంసంగ్ కేర్ ప్లస్ సేవ.. పరిశ్రమలోనే మొట్టమొదటిసారిగా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌లు, స్క్రీన్ సమస్యలకు కూడా కవరేజీని పరిచయం చేస్తోంది. శాంసంగ్ కేర్ ప్లస్ ఎక్స్‌టెండెడ్ వారంటీ ప్లాన్‌ల లభ్యతను అన్ని ఛానెళ్లలో విస్తరిస్తున్నామని శాంసంగ్ ఇండియా డిజిటల్ అప్లయన్సెస్ వైస్ ప్రెసిడెంట్ గుఫ్రాన్ ఆలం తెలిపారు. కస్టమర్లు 9 భాషల్లో బహుళ భాషా మద్దతును పొందుతారు. అదే సమయంలో శాంసంగ్ యాప్ ద్వారా కస్టమర్లు తమ సర్వీస్‌లను ట్రాక్ చేయవచ్చు, షెడ్యూల్ మెయింటెనెన్స్ కోసం సకాలంలో రిమైండర్‌లను పొందవచ్చు..

## డబ్ల్యూహెచ్ఓ సీఓపీ11కి ముందు సరికొత్త నివేదిక వెల్లడి

**విజయవాడ, మేజర్ న్యూస్ :** పొగాకు వినియోగం ప్రజారోగ్యానికి సంబంధించి అతి పెద్ద సవాళ్లలో ఒకటిగా నిలిచి ఉంది. ప్రతి సంవత్సరం ఇది 80 లక్షలకు పైగా ప్రాణాలను బలికొంటోంది. ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఒక నూతన నివేదిక ప్రకారం, పొగాకు హాని తగ్గింపు, ధూమపానం మానేయడానికి మెరుగైన మద్దతు, వ్యాధిని ముందుగా గుర్తించే విధానాలు వంటి 21వ శతాబ్దపు ఆవిష్కరణల పూర్తి సామర్థ్యాన్ని ప్రపంచ దేశాలు అందిపుచ్చుకుంటే ఈ భయంకరమైన మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చు. ఈ చర్యలన్నీ కలిసి 2060 సంవత్సరం నాటికి ప్రపంచవ్యాప్తంగా 10 కోట్లకు పైగా ప్రజల ప్రాణాలను కాపాడటానికి సహాయపడగలవని ఆ నివేదిక సూచిస్తోంది. డబ్ల్యూహెచ్ఓ సీఓపీ11కి ముందు సేవ్:సేవింగ్ 100 మిలియన్ లైవ్స్ బై 2060 పేరుతో ఈ నివేదిక విడుదల చేయబడింది. దీనిని ప్రముఖ ప్రజారోగ్య నిపుణులు, ప్రాజెక్ట్ లీడర్ డాక్టర్ డెరెక్ యాచ్, డాక్టర్ డెలన్ హ్యూమన్ వంటి ప్రముఖ నాయకులు రచించారు. ధూమపానానికి సంబంధించిన మరణాల రేటును వినూత్నమైన శాస్త్రీయ ఆధారిత విధానాల ద్వారా ఎంతగా తగ్గించవచ్చో తెలియజేస్తూ, ఈ నివేదిక ఒక స్పష్టమైన, ఆచరణాత్మకమైన కార్యాచరణ ప్రణాళికను అందిస్తోంది.

## ఏక్తార్యాలీలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని బుధవారం మైలవరంలో నిర్వహించిన ఏక్తా ర్యాలీలో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ బుధవారం పాల్గొన్నారు. మైలవరం పట్టణంలో ఇంజనీరింగ్ కళాశాల మైదానం నుంచి నిర్వహించిన ఈ ర్యాలీని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ భారత చరిత్రలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పేరు అనగానే దృఢమైన సంకల్పం, అంచెంచల నాయకత్వం, దేశ ఐక్యతకు ప్రాణావర్పించిన వ్యక్తిత్వం గుర్తుకొస్తాయని తెలియజేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా విడివిడిగా ఉన్న అనేక సంస్థానాలను భారతదేశంలో కలపటం వలన భారతదేశ సమైక్యతను కాపాడటంలో ప్రముఖ పాత్ర పోషించిన స్వాతంత్ర్య సమరయోధుడు ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని భారత్ ఏక్తా దివస్‌గా జరుపుకుంటారు అని తెలియజేసి, భారతీయులు అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

### ప్రకటన

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా కృష్ణాజిల్లా బందరు మండలం, గుండుపాలెంకు చెందిన బలగం వెంకటరమణ అను నేను వివాహ అనంతరం కంబాల స్వామలగా నాపేరు మార్చుకున్నాను అని తెలియబర్చుచున్నాను.

# మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను నిరసిస్తూ భారీ ర్యాలీ..





**పామర్రు మేజర్ న్యూస్:** ప్రభుత్వం నిర్మించి నిర్వహించవలసిన మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిరంకుశత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీగా తరలివెళ్లి తాసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం పార్టీ అధ్యక్షులు వై.యస్.జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు స్థానిక మాజీ శాసనసభ్యులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుండి తహశీల్దార్ కార్యాలయానికి ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ ర్యాలీ గా తరలి వెళ్లి డిప్యూటీ తహశీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. అనంతరం తాసిల్దార్ కార్యాలయ ఆవరణలో అనిల్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ వైద్య విద్యను అభ్యసించాలనుకునే పేద విద్యార్థులకు తీరని అన్యాయం చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ పేరుతో 10 కొత్త మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరించాలని నిర్ణయించిందన్నారు. దేశంలో ఎక్కడా మెడికల్ కాలేజీల్లో పీపీపీ విధానం అనేది లేదని, గోవా, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలు దానిపై ఆలోచన చేసినా తీవ్ర ప్రజా వ్యతిరేకతతో ఆ పద్ధతిపై వెనక్కు తగ్గాయన్నారు. ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలన్న సంకల్పంతో గత వైయస్సార్సీపీ ప్రభుత్వం ఒకేసారి 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి అడుగులు వేసిందని, వైయస్ జగన్ ప్రభుత్వ హయాంలోనే వాటిలో 7 కాలేజీల నిర్మాణం పూర్తి కాగా, 5 కాలేజీల్లో అడ్మిషన్లు కూడా ప్రారంభం అయ్యాయని తెలిపారు. మరో 10 కాలేజీల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల మెడికల్ కాలేజీల్లో 2023%–%24లోనే తరగతులు మొదలు కాగా, 750 మెడికల్ సీట్లు అందుబాటులోకి వచ్చాయని, పులివెందుల, పాడేరు మెడికల్ కాలేజీల పనులు కూడా పూర్తి కాగా, నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం 2024–25లో వాటిలో తరగతులు ప్రారంభం కావాల్సి ఉందన్నారు.

ఎన్నికలు ముగిశాక పాడేరు మెడికల్ కాలేజీలో తరగతులు ప్రారంభం కాగా, పులివెందుల మెడికల్ కాలేజీకి కూడా 50 సీట్లు ఇస్తూ జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) ఆదేశాలు జారీ చేసిందని, అయితే ఆ సీట్లు వద్దంటూ కూటమి ప్రభుత్వం ఎన్ఎంసీకి లేఖ రాసిందని తెలిపారు.

ఆ విధంగా రాష్ట్రానికి చాలా అన్యాయం చేయడమే కాకుండా, వైద్య విద్య అభ్యసించాలన్న పేద విద్యార్థుల ఆశపై ప్రభుత్వం నీళ్లు జల్లిందని విమర్శించారు. 50 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఒక్కో మెడికల్ కాలేజీ ఉండగా, ఎకరా రూ.100 కే వాటిని ప్రైవేటుకు ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. తొలి దశలో పులివెందుల, మార్కాపురం, మదనపల్లె, అదోని మెడికల్ కాలేజీలు, రెండో దశలో అమలాపురం, బాపట్ల, పెనుకొండ, నర్సీపట్నం, పాలకొల్లు, పార్వతీపురం కాలేజీలు అలా రెండు దశల్లో 10 మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరించాలని నిర్ణయించారని పేర్కొన్నారు. ఆ దిశలో మొదటి నాలుగు కాలేజీలకు ఆర్ఎఫ్పీ (రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్)కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, అలా నిస్సిగ్గుగా కొత్త మెడికల్ కాలేజీలను పప్పు, బెల్లానికి అమ్మేయడానికి సిద్ధమయ్యారని విమర్శించారు.

ఈ ప్రభుత్వ నిర్వాకం వల్ల ఉచిత వైద్య సేవలు దూరమై పేద రోగులు, మెడికల్ సీట్లు కోల్పోయి విద్యార్థులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిజానికి కొత్త మెడికల్ కాలేజీలు ఏ ఇబ్బంది లేకుండా కొనసాగేలా సీట్ల భర్తీకి సంబంధించి నాడు సీఎం వైయస్ జగన్ ఒక విధానాన్ని ప్రకటిస్తే దానిపై అప్పుడు టీడీపీ నాయకులు విరుచుకుపడ్డారని తెలిపారు. మెడికల్ సీట్ల భర్తీలో సెల్ఫ్ ఫైనాన్స్, ఎస్ఆర్పి కోటాకు సంబంధించిన జీఓలను అధికారంలోకి రాగానే రద్దు చేసి అన్ని సీట్లూ ప్రభుత్వ రంగం (కన్వీనర్ కోటా) లో భర్తీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. దానికే కట్టుబడి ఉంటే, ఎన్నికలకు ముందు చెప్పినట్లుగా మొత్తం 17 కాలేజీలను అందుబాటులోకి తీసుకు వచ్చి అన్ని సీట్లు కన్వీనర్ కోటాలో భర్తీ చేయాలని, ఆ మేరకు జీఓలు సవరించాలని డిమాండ్ చేశారు. ఒక ప్రాంతంలో మెడికల్ కాలేజీ వస్తే, ఆ ప్రాంతం వారికి మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలు అందుతాయని, సూపర్ స్పెషాలిటీ వైద్య నిపుణులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది అందుబాటులోకి వస్తారని పేర్కొన్నారు. మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఏర్పడే నర్సింగ్ కాలేజీల వల్ల, పారా మెడికల్ తో పాటు వైద్యపరమైన శిక్షణ సంస్థల వల్ల అక్కడ ఒక మెడికల్ హబ్ ఏర్పడుతుందని, తద్వారా ఆర్థిక వ్యవస్థ బలపడుతుందన్నారు. ఇంకా వీటన్నింటి ద్వారా మెడికల్ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని, దీంతో ఆ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. దీన్ని గట్టిగా నమ్మిన వైయస్ జగన్ 8,480 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఒకేసారి 17 మెడికల్ కాలేజీల నిర్మాణం మొదలుపెట్టారని తెలిపారు. వైయస్సార్సీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి వాటిలో దాదాపు రూ.3 వేల కోట్ల విలువైన పనులు జరిగాయన్నారు. వాటికి నాబార్డు నుంచి కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక సహాయం రూపంలో, కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకం నుంచి ఫైనాన్షియల్ టై అప్స్ జరిగాయన్నారు. ఈ ప్రభుత్వం చెబుతున్నట్లుగా కొత్త మెడికల్ కాలేజీలకు నిధుల లోటు అన్నది పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. కొత్త మెడికల్ కాలేజీల కోసం ఏటా 1000 కోట్ల రూపాయల చొప్పున 5 ఏళ్లు వ్యయం చేస్తే చాలని కానీ, ప్రభుత్వం ఆ దిశలో ఆలోచన చేయకుండా పీపీపీ పేరుతో ప్రైవేటీకరణపై ఏకపక్ష నిర్ణయం తీసుకుందన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వల్ల వాటికి అనుబంధంగా ఉండే బోధనాస్పత్రుల్లో పేదలకు పూర్తి స్థాయిలో ఉచిత వైద్య సేవలు అందవని, ఇంకా రోగ నిర్ధారణ, ఇన్ పేషంట్, మందులకు నగదు వసూలు చేస్తారని పేర్కొన్నారు. మరో వైపు రాష్ట్రం పెద్ద సంఖ్యలో మెడికల్ సీట్లు కోల్పోతుందని పేర్కొన్నారు. గత ఏడాది 750 ఎంబీబీఎస్ సీట్లు సమకూరాల్సి ఉన్నా, చంద్రబాబు ప్రభుత్వ కక్షపూరిత విధానాలతో 700 సీట్లు కోల్పోయామని, 2025–26లో 1,750 సీట్లు.. అలా మొత్తం 2,450 మెడికల్ సీట్లు మన పిల్లలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీలు కూడా పూర్తి చేసి, అన్నింటినీ ప్రభుత్వమే నిర్వహించాలని వైయస్సార్సీపీ డిమాండ్ చేస్తోందని అనిల్ కుమార్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో నియోజవర్గ పరిధిలోని అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు, జిల్లా స్థాయిలో వివిధ హోదాలలో ఉన్న నాయకులు, పార్టీకి చెందిన స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మైలవరం లో..




**జి.కొండూరు మేజర్ న్యూస్ :** ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు మైలవరం నియోజకవర్గం ఇంచార్జ్ మాజీ మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ నాయకత్వంలో మైలవరం లో జరిగిన నిరసన కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న వైయస్ఆర్సీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేసారుఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధి, కొండపల్లి మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ గుంజ శ్రీనివాసు, ఐదవ వార్డు కౌన్సిలర్ మొగిలి దయ, మైలవరం నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు కుంచం జయరాజు, జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు పచ్చిగోళ్ళ పండు, సీనియర్ నాయకులు గరికిపాటి రాంబాబు, బత్తుల రాజేష్, కిషోర్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## జిల్లా కో మెడికల్ కాలేజీ తెచ్చిన ఘనత వైఎస్ జగన్మోహన్ రెడ్డి దే



**పెడన,మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో పేదలకు వైద్యం అందటం లేదని అందని ద్రాక్షాలా మిగులుతుందని పేదల పిల్లలు కూడా ఉన్నత విద్యలు అభ్యసించి డాక్టర్లు కావాలనే ఉద్దేశంతో జిల్లాకి ఓ మెడికల్ కాలేజీని ఆనాడు జగన్మోహన్ రెడ్డి నిర్మిస్తే దానిని నిర్వీర్యం చేయటమే లక్ష్యంగా నారా చంద్రబాబు నాయుడు చేస్తున్నాడని నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి ఉప్పల రమేష్( రాము) అన్నారు. ఈ మేరకు ఆయన పట్టణంలో ప్రధాన రహదారి గుండా నిరసన కార్యక్రమాన్ని చేస్తూ ర్యాలీగా బయలుదేరి తాసిల్దార్ కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ పై నిరసన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. రాష్ట్రంలో ప్రతి జిల్లాలో ఒక మెడికల్ కాలేజీ ఉండాలనే లక్ష్యంతో ఆనాడు జగన్మోహన్ రెడ్డి పని చేస్తే దానిని నిర్వీర్యం చేసి ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టి కోట్లు దండకుంటవే చంద్రబాబు నాయుడు లక్ష్యం అని అన్నారు. ఆనాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ అమలు చేయడం ద్వారా ఎంతోమంది నిరుపేదల కుటుంబాల్లో పిల్లలు ఇంజనీర్లు డాక్టర్లు అయ్యారని తెలిపారు. వైసిపి హయాంలో రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీ లను తీసుకొచ్చామని మనం మచిలీపట్నంలో మెడికల్ కాలేజీ ప్రారంభం కూడా అయిందని పేర్కొన్నారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తుల పరం చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కటకం నరకం మారే ప్రసాదు వైసిపి కౌన్సిల్ సభ్యులు జడ్పిటిసి ఎంపీటీసీలు మండల అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ సాగిన ర్యాలీ.....






**జగ్గయ్యపేట :నవంబర్ 12 మేజర్ న్యూస్ :** మాజీ ముఖ్యమంత్రి, వైయస్ఆర్సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైయస్ఆర్సీపీ ప్రజా ఉద్యమం అవగాహన ర్యాలీ చేపట్టడం జరిగిందని వైయస్ఆర్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్ ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. బుధవారం పట్టణంలోని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయం నుండి ప్రజా ఉద్యమం ర్యాలీని నియోజకవర్గ వైయస్ఆర్ సీపీ శ్రేణులతో కలిసి ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా వైఎస్ఆర్సిపి రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు టి.జె సుధాకర్ బాబు పాల్గొన్నారు, ఈ సంధర్భంగా కోదాడ రోడ్డులోని పార్టీ కార్యాలయం నుండి పాత మున్సిపల్ ఆఫీస్, నెహ్రూ చౌక్, కన్యాకుమారి పాన్ షాప్ సెంటర్, సాయిబాబా ఆలయం, ఆర్.సి.యం చర్చి మీదగా తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం జగ్గయ్యపేట తహశీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వైయస్ జగన్ మోహన్ రెడ్డి 17 మెడికల్ కాలేజీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టి, వాటిలో 5 కాలేజీలను వైసీపీ ప్రభుత్వంలోనే ప్రారంభించారన్నారు. తద్వారా 750 ఎంబీబీఎస్ సీట్లను మన విద్యార్థులకు అదనంగా సమకూర్చారని, ప్రజలకు చేరువలో మెరుగైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వాస్పత్రులను బోధనాస్పత్రులుగా బలోపేతం చేశారన్నారు. ఆ తర్వాత గత ఏడాది చంద్రబాబు గద్దెనెక్కడంతో వైద్య కళాశాలలకు చంద్రగ్రహణం పట్టుకుందని తెలిపారు. లక్ష కోట్ల విలువైన సంపద లాంటి ప్రజల ఆస్తులను పచ్చ కార్పొరేట్ గద్దలకు దోచిపెట్టడం కోసం చంద్రబాబు పీపీపీ పేరుతో కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. దీనిపై వైయస్ఆర్సీపీ ప్రజా ఉద్యమం పేరుతో ఉద్యమ కార్యాచరణ చేపట్టడం జరిగిందని అన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం వెనక్కి తీసుకునే వరకు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోరుబాట కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మహిళలు, కార్యకర్తలు, పార్టీలో వివిధ అనుబంధ విభాగాల నాయకులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్లు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పేదల వైద్య హక్కుల కోసం వీధుల్లోకి వైసీపీ



**గన్నవరం, నవంబర్ 12, మేజర్ న్యూస్ :** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, గన్నవరం నియోజకవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ శాసనసభ్యులు డా. వల్లభనేని వంశీ మోహన్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గన్నవరం నియోజకవర్గంలో భారీ నిరసన ర్యాలి నిర్వహించారు. ఈ ర్యాలీలో విజయవాడ రూరల్, గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ గన్నవరం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమై, నినాదాలతో ఉత్సాహంగా గన్నవరం ఎమ్మార్వో కార్యాలయం వరకు కొనసాగింది. అనంతరం డా. వంశీ మోహన్ ఎమ్మార్వో కి వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్వో ఈ వినతిపత్రాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీపీ అనగాని రవి మాట్లాడుతూ..ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం ద్వారా పేద ప్రజలకు వైద్యం అందుబాటులో లేకుండా చేస్తున్నారని, ప్రతి ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అనుబంధంగా ప్రజలకు సేవలందించే ప్రభుత్వ ఆసుపత్రి ఉంటుందని, ప్రైవేటీకరణ వల్ల పేద విద్యార్థులకు డాక్టర్ అవ్వడం దాదాపు అసాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గన్నవరం నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా టీడీపీ కమిటీల ప్రమాణస్వీకారం



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మైలవరం నియోజకవర్గ పరిధిలోని తెలుగుదేశం పార్టీ కమిటీల ప్రమాణస్వీకార మహోత్సవ వేడుకలు బుధవారం అంగరంగ వైభవంగా జరిగాయి. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు ఆధ్వర్యంలో జి.కొండూరు మండలంలోని చెవుటూరు శివార్లలో జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నలుమూలల నుండి తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. దీంతో ఈ ప్రాంతం పసుపుమయంగా మారింది. పార్టీ పునర్నిర్మాణమే ప్రధాన లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమం పూర్తిగా పండుగ వాతావరణంలో జరిగింది. స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదుతో పాటు ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షులు, కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాం, నూర్ భాషా, దూదేకుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు, మైలవరం నియోజకవర్గ పార్టీ పరిశీలకులు ధారునాయక్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. అన్న ఎన్టీఆర్ విగ్రహ ప్రతిమకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ స్థాయి కమిటీలు, అనుబంధ సంఘాలతో ప్రమాణ స్వీకారం చేయించారు. కేకులు కట్ చేశారు. వారిని ఘనంగా సత్కరించారు. అన్ని మండలాల నుంచి తెలుగుదేశం పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు అన్న ఎన్టీఆర్ కృషిని, తెదేపా జాతీయ అధ్యక్షులు, సీఎం చంద్రబాబునాయుడు, తెదేపా జాతీయ కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ పార్టీని నడిపిస్తున్న వైనాన్ని వివరించారు. పార్టీలో అందరం నడుచుకుంటూ, ఏకతాటిపై నిలిచి టీడీపీని మరింత శక్తివంతంగా మార్చి ఏపీ సమగ్రాభివృద్ధికి కృషి చేద్దామని అన్నారు.

# మండలంలోని ఆరు గ్రామాలకు తాగునీరు అందించాలి...



**వత్సవాయి : నవంబరు 12 మేజర్ న్యూస్ :** వత్సవాయి మండల పర్యటనకు విచ్చేసిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీషా కు, స్థానిక శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ కు సిపిఎం పార్టీ నాయకులు వత్సవాయి మండలంలోని ఆరు గ్రామాల ప్రజలకు మొంథా తుఫాను దగ్గర నుండి ఇప్పటివరకు త్రాగునీటి సౌకర్యం లేక ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులకు గురి అవుతున్నారని తక్షణమే తగు చర్యలు చేపట్టి ఈ ప్రాంత ప్రజానీకానికి త్రాగినీటి సరఫరాకు తక్షణ చర్యలు చేపట్టాలని వినతి పత్రం అందజేసినారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా నాయకులు సిహెచ్ హనుమంతరావు, మండల కార్యదర్శి బి.రాము లు మాట్లాడుతూ వత్సవాయి మండలంలోని వత్సవాయి, దబ్బాకుపల్లి, పోచవరం, గంగవల్లి, లింగాలు, పోలంపల్లి, పెంటల వారి గూడెం గ్రామాలకు. గత 12 రోజుల నుండి ప్రజలకు త్రాగునీరు అందడం లేదనీ మొంథా తుపాన్ వల్ల వచ్చిన అకాల వరదాల వల్ల లింగాల గ్రామం వద్ద మున్నేటి కాజ్వే పైవేసిన మంచినీటి పైపులైన్లు కొట్టుకొని పోవడం. జరిగిందని ప్రజలు తాగునీరు లేక తీవ్ర ఇబ్బంచులు పడుతున్నారనీ యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేసి ఈ గ్రామాల ప్రజల మంచినీరు అందించవలసిందిగా తెలియజేశారు. అలాగే వత్సవాయి మండలంలోని ప్రత్తి పంటను 10.500 ఎకరాలు రైతులు సాగు చేశారు. ఈ మధ్య కాలంలో కురిసిన అకాల వర్షల వల్ల. ప్రత్తి పంట తీవ్రంగా దెబ్బతింది. రైతులకు, కౌలురైతులకు ప్రత్తి పంటకు నష్టా పరిహారం ఇప్పించవలసిందిగా రైతుల తరుపున విజ్ఞప్తి చేశారు.

# పేదల సొంతింటి కల నెరవేర్చుడం కూటమి ప్రభుత్వ లక్ష్యం





**పెడన, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో ప్రతి ఒక్క కుటుంబం సొంత ఇల్లు కలిగి ఉండాలని ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదల సొంతింటి కల నెరవేరుస్తున్నారని నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన పట్టణంలో గల నాలుగో వార్డులో సొంత ఇంటి కల నెరవేర్చుకున్న కుటుంబ గృహప్రవేశం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాగిత మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా, కక్షసాధింపులకు తావులేకుండా పేదల సొంతింటి కల నెరవేర్చడమే తమ బాధ్యత అని స్పష్టంచేశారు. ఆంధ్ర రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్రాముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం ఒకేసారి 3,00,192 గృహ ప్రవేశాలు చేయిస్తున్నారు అని. అధికారంలోకి వచ్చిన 17 నెలల్లో ఇళ్లు పూర్తి చేసి లబ్దిదారులకు అప్పగిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-బీఎల్సీ పథకంలో 28,034 ఇళ్లు, పీఎంఏవై గ్రామీణ్ కింద 65,292 ఇళ్లు, పీఎంఏవై జన్మన్ పథకం కింద మరో 6,866 ఇళ్లను పూర్తి చేసే ఘనత ఈ కూటమి ప్రభుత్వనీదే అని చెప్పారు. 2014-19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వం వివిధ విభాగాల్లో ఎనిమిది లక్షల ఇళ్లు నిర్మించిందన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన 17 నెలల కాలంలోనే మూడు లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. ఇళ్ల స్థలం ఉన్నవారు కొత్త ఇంటి కోసం ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోండి...అని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పెడన కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తలు, టీడీపీ వార్డులు ఇన్చార్జిలు,లబ్ధిదారులు అధికారులు ఉన్నారు.

## అంతర్గత సీసీ రోడ్లు, డ్రెయిన్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన



**జి కొండూరు మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము - పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగము, గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖ ఆధ్వర్యంలో విజయవాడ రూరల్ మండలంలోని గొల్లపూడి గ్రామములో శ్రీనివాసనగర కాలనీలో అంతర్గత సిమెంటు రహదారులు, డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణమునకు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ వీటి నిర్మాణానికి అంచనా విలువ: రూ.79.90 లక్షలు కాగా, మండల పరిషత్తు నిధులు రూ.71.90 లక్షలు, గ్రామ పంచాయతీ నిధులు రూ. 8.00 లక్షలు వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా గొల్లపూడిలో ఎన్. ఎస్. ఎస్ కాలనీలో సిమెంట్ కాంక్రీటు డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణమునకు ఎంపీపీ 15వ ఆర్థికసంఘం నిధులు రూ.43.50 లక్షలతో శంఖుస్థావన చేసినట్లు పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్ళుగా ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## న్యూమోనియా దినోత్సవ సందర్భంగా అవగాహన



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** ప్రపంచ న్యూమోనియా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండల పరిధిలోని వీరంకిలాకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారి డాక్టర్ సైరా ఖాతూన్ మాట్లాడుతూ ప్రపంచ న్యూమోనియా దినోత్సవ సందర్భంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలను బుధవారం నుండి ప్రారంభించి 2026 ఫిబ్రవరి 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు వచ్చే వ్యాధులలో న్యూమోనియాకు సంబంధించిన వ్యాధి లక్షణాలు తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. అలాగే ప్రతి బిడ్డకు తప్పనిసరిగా ఆరు నెలల వరకు తల్లిపాలు ఇచ్చేలా చూడాలని, అనంతరం పౌష్టికాహారం అందించాలని తల్లిదండ్రులకు సూచించాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలను ఎప్పటికప్పుడు క్రమం తప్పకుండా సూచించిన సమయంలో వేసుకునేలా చూడాలని కోరారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు ఎటువంటి అనారోగ్య సమస్యలు వచ్చినా వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిని సంప్రదించాలని డాక్టర్ సైరా ఖాతూన్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం పరిధిలోని వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పిల్లల దత్తతపై అవగాహన కార్యక్రమం నిర్వహణ



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** పిల్లల దత్తత పై అవగాహన మహోత్సవాల్లో భాగంగా బుధవారం మండల పరిధిలోని చోరగుడి-3 అంగన్ వాడి కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాపురం సెక్టార్ అంగన్ వాడి సూపర్ వైజర్ అబ్దుల్ సలీం ఉన్నీసా పాల్గొని పిల్లల దత్తతపై తల్లులకు పలు సూచనలను అందించారు. ఎవరైనా దత్తత తీసుకోవాలంటే చట్టపరంగా తీసుకోవాలని, లేకుంటే దత్తత ఇచ్చిన వారు తీసుకున్న వారు కూడా చట్టపరంగా శిక్షకు గురవుతారని తెలిపారు. దత్తత తీసుకోవాలనుకున్నవారు చట్టపరంగా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుని అందుకు అవసరమయ్యే రుసుమును చెల్లించి దత్తత తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడి కార్యకర్తలు కె.వరలక్ష్మి, బి. నిర్మలకుమారి, ఎ.అపూర్వ, ఎం.శిరీష తదితరులతో పాటు పలువురు తల్లులు పాల్గొన్నారు.

## మైక్రో ఫిల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన



**పెదన/ గూడూరు మేజర్ న్యూస్:** ఈరోజు గూడూరు మండలం కప్పలదొడ్డి గ్రామం లో ఎంపీ లార్డ్స్ 13 లక్షల రూపాయలతో ఐదు లక్షల లీటర్ల కెపాసిటీ గల మైక్రో ఫిల్టర్ శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించామని గ్రామ సర్పంచ్ యక్కల మాధవి తెలిపారు. ఈ మేరకు శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఒక ప్రకటనలో మాట్లాడుతూ కప్పల దొడ్డి గ్రామానికి ఎంపీ లార్డ్స్13 లక్షల రూపాయలతో ఐదు లీటర్ల కెపాసిటీ గల మైక్రో వాటర్ ఫిల్టర్ శంకుస్థాపన కార్యక్రమం చేశామన్నారు. దీని నిర్మాణం వల్ల గ్రామ ప్రజల దాహార్తి తీర్చి ఆరోగ్యకరమైన నీటిని అందించే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కట్టా మునీశ్వరరావు, ఎంపీటీసీ పేరిశెట్టి తేజవతి, ఆర్డబ్ల్యుసి జేఈ నాగరాజు, గ్రామ సెక్రెటరీ నాగజ్యోతి, గ్రామస్తులు పాల్గొనడం జరిగింది.

## యలమర్రు, ఈదులమద్దాలిలలో రెవిన్యూ గ్రామసభలు



**పెదపారుపూడి మేజర్ న్యూస్:** రైతుల భూ సమస్యల పరిష్కారంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని యలమర్రు, ఈదులమద్దాలి గ్రామాలలో గ్రామసభలు నిర్వహించారు. పట్టా దారు పేరు, విస్తీర్ణం సరి దిద్దడం, తొలగించడం జీరో- విస్తీర్ణం, నోషనల్ ఖాతాల సంబంధిత అంశా లు, అన్ని జాయింట్ ఎల్ పి ఎం కేసులు పరిష్కారం కోసం గ్రామ సభల ద్వారా రైతుల వద్ద నుండి అర్జీలను స్వీకరించారు. సబ్ డివిజన్ ద్వారాను, సుమోటో కరెక్షన్ ద్వారా సదరు జాయింట్ ఎల్ పి ఎంను పరిష్కరించేందుకు నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామని తాసిల్దార్ బి.శ్రీనునాయక్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ గ్రామ సభలలో యలమర్రులో 13 అర్జీలు, ఈదులమద్దాలిలో 7 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు జాయింట్ ఎల్పిఎం పై అవగాహనను కల్పించారు. గ్రామ సభలలో రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ డి.సుందర రావు, సర్వేయర్ బసవయ్య, వీఆర్వోలు ఫణికుమార్, రాజబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## చట్టవిరుద్ధంగా పిల్లలను దత్తత తీసుకుంటే శిక్షార్హులు




**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** చట్ట విరుద్ధంగా పిల్లలను దత్తత తీసుకోవడం నేరమని అంగన్ వాడి సూపర్ వైజర్ అరుణకుమారి పేర్కొన్నారు. మండల పరిధిలోని చినపారుపూడి గ్రామంలో జాతీయ దత్తత అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అరుణకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం దత్తతను చట్టబద్ధత చేసిందని, కావున ప్రతి ఒక్కరు చట్టబద్ధంగా పిల్లలను దత్తత తీసుకోవాలని ఆమె సూచించారు. చట్టబద్ధత లేకుండా ఎవరైనా పిల్లలను దత్తత తీసుకున్నా, ఇచ్చినా ఇరువురి పైన కేసులు నమోదు అవుతాయని, మూడు నుండి ఐదు సంవత్సరాల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంటుందని తెలిపారు. కావున ప్రతి ఒక్కరు దత్తత కార్యక్రమాలపై అవగాహన పెంపొందించుకుని చట్టపరంగా దత్తత తీసు కోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళా సంరక్షణ అధికారి, అంగన్ వాడి కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, పలువురు తల్లులు పాల్గొన్నారు. అలాగే మండల పరిధిలోని వెంట్రుప్రగడ గ్రామంలో కూడా అవగాహన సదస్సులు నిర్వహించారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ ఎం.శివ నాగమణి, అంగన్ వాడి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

## జాబ్ ట్రైనింగ్ ప్రోగ్రాం

**మొవ్వ మేజర్ న్యూస్:** క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల మొదటి, రెండవ సంవత్సరం ఒకేషనల్ విద్యార్థు లకు మొవ్వ లోని ప్రభుత్వ కార్యాలయాలలోజరుగుతున్న ఆన్ ది జాబ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ను కృష్ణా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎస్. సరళ కుమారి పర్యవేక్షించారు. అకౌంటింగ్, టాక్సేషన్ విభాగం విద్యార్థులకు మొవ్వ లోని పి ఎ సి ఎస్ ఆఫీస్, మండల అభివృద్ధి శాఖ అధికారి కార్యాలయంలో, ఆఫీస్ అసిస్టెంట్ షిప్ ఒ. ఎ. ఎస్ విద్యార్థులకు సబ్ ట్రెజరీ కార్యాలయం, ఐ.సి. డి. ఎస్ ఆఫీస్ విద్యార్థులకు ఈ శిక్షణ వల్ల ఉద్యోగ నైపుణ్యాలకు ఉపయోగపడుతుందని. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, ద్వితీయ సం వత్సరం పబ్లిక్ పరీక్షలలో 100 మార్కులు ఈ ట్రైనింగ్ కు కేటయించారని తెలిపారు.ఈ కార్యక్రమంలోప్రిన్సిపాల్ డి.సత్యనారాయణ, అధ్యాపకులు ఎ.వాసు బాబు కె. రంగనాయకులు, బి. గౌరమ్మ,ఎం. ఆనంద రావు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు ఆర్థిక చేయూతకు త్వరలో కో -ఆపరేటివ్ సంఘాలు

**జగ్గయ్యపేట మేజర్ న్యూస్ :** దివ్యాంగులను సంఘటిత పరిచి వారి ఆర్థిక అవసరాలు తీర్చడం కోసం గ్రామ,మండల స్థాయిలలో కో ఆప రేటివ్ సంఘాలు ఏర్పాటు చేయనున్నట్టు స్వయంశక్తి దివ్యాంగుల సంక్షేమ, అభివృద్ధి సంఘం నియోజకవర్గ అధ్యక్షులు వడ్డెపూడి ఉమామహేశ్వరరావు తెలిపారు. వచ్చే మూడునెలల్లో ప్రతి గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి వారికి కో ఆపరేటివ్ సంఘాలపై అవగాహన ఇచ్చి వారికి వారే నడుపుకునే విధంగా స్వయం శక్తి పేరుతో గ్రామస్థాయి, మండలస్థాయి సంఘాలు ఏర్పాటు చేస్తున్నామని ఇది రాష్ట్రంలో తొలి ప్రయత్నమని, దివ్యాంగుల ఆర్థిక కష్టాలకు ఆ దుకునే విధంగా సంఘాలు పనిచేస్తాయని,వారిలో పొదుపు అలవాటు చేయడం, ఉపాధి వృత్తులకు కావలసిన రుణాలు అందివ్వడం, బ్యాంకులకు ఈ దివ్యాంగుల సంఘాలను కో ఆపరేటివ్‌లు అనుసంధానమై పనిచేస్తాయిని తెలిపారు.

**దివ్యాంగుల సేవకు స్వచ్ఛంధ కార్యకర్తలు కావలెను....**

జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని జగ్గయ్యపేట, పెనుగ్రంచిప్రోలు, వత్సవాయి, నందిగామ మండలాలలో దివ్యాంగులకు సేవ చేసేందుకు గ్రామ స్థాయి, మండల స్థాయిలలో స్వచ్ఛంద కార్యకర్తలను ఎంపిక చేస్తున్నట్టు స్వయంశక్తి దివ్యాంగుల సంక్షేమ, అభివృద్ధి సంఘం నియోజకవర్గ అధ్యక్షులు వడ్డే పూడి ఉమామహేశ్వరరావు తెలిపారు. దివ్యాంగులకు పలు రకాల ఆరోగ్య సమస్యలు వున్నాయని, ఎక్కడి వెళ్ళాలన్నా ఓ సహాయకుడు కావలసిన అవసరం వుందని అలాంటి వారికి సేవ చేయడానికి, దివ్యాంగుల కోసం గ్రామ, మండల స్థాయిలలో ఏర్పడనున్న కో ఆపరేటివ్ సంఘాలలో పనిచేయడానికి గాను ఆసక్తి గలిగిన, కనీసం 10 వతరగతి లేదా ఆపైన ఇంటర్, డిగ్రీ పైన చదివి వారికి అవకాశం ఉంటుంది. సేవా భావం వున్న 40 సంవత్సరాల లోపు యువతీయువకుల నుంచి దరఖాస్తులను కోరుతున్నామని తెలిపారు. ఈ స్వచ్ఛంద కార్యకర్తలను సేవా కార్యక్రమాలపై సరైన శిక్షణ ఇవ్వడం కొంత కాలం పాటు వారి పనితీరు, ప్రవర్తన తీరు బాగుంటే వారికి స్వయం శక్తి సంస్థ ఉద్యోగులుగా తీసుకొని వారికి సరైన గౌరవవేతనం కూడా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. త్వరలో జరిగే మౌఖిక, వ్రాత పరీక్షల ద్వారా వారిని ఎంపిక చేయడం జరుగుతుంది.ఆసక్తి వున్న వారు తమ బయోడేటాను నవంబర్ 23 లోపు వడ్డేపూడి ఉమామహేశ్వరరావు (9908034300) కు వాట్సప్ ద్వారా పంపగలరు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**పెదన, మేజర్ న్యూస్ :** మండల పరిధి బల్లిపర్రు గ్రామ సమీపాన రోడ్డు ప్రమాదం లో బ్రహ్మం అనే వ్యక్తి మృతి చెందాడు. స్థానిక పదో వార్డు రాజీవ్ నగర కాలనీ నివాసి బ్రహ్మం( 55) అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా వెనక నుండి ఒక కారు వచ్చి ఢీకొనడంతో తీవ్ర గాయాలతో పడిపోయాడు దీంతో స్థానికులు 108 సమాచారం అందించి మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడని స్థానికులు పేర్కొన్నారు. అతను రాజీవ్ నగర్ కాలనీ లో నివాసం ఉంటున్నాడు. దీంతో ఆ కాలనీ అంతా శోకసముద్రంలో మునిగిపోయింది. బ్రహ్మం తాను తోట మూల సెంటర్లో ఒక బైక్ మెకానిక్ గా పని చేస్తున్నాడు. అతనికి భార్య ఒక కుమార్తె కొడుకు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్సై సత్యనారాయణ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం బందరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేశామన్నారు.ల

## 'శ్రీ' మంతం సినిమాను విజయవంతం చేయండి



**మచిలీపట్నం మేజర్ న్యూస్:** పెదన మండలం జింజేరు గ్రామానికి చెందిన, మచిలీపట్నం పూర్వ విద్యార్థి యువకుడు కథానాయకుడు వజ్రయోగి, కథానాయకురాలు శ్రేయ భారతి దర్శకుడు సుధాకర్ పాణి దర్శకత్వంలో తెరక్కెక్కిన 'సి' మంతం సినిమాను విజయవంతం చేయాలి సినిమా యూనిట్ కోరారు.ఈ మేరకు సినిమా ప్రమోషన్ లో భాగంగా జింజేరు గ్రామం నుండి పెదన మీదుగా మచిలీపట్నం సిని అభిమానులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనిట్ వారు ఒక ప్రకటనలో మాట్లాడుతూ సినిమాను గుడివాడ, మచిలీపట్నం, పీవిఆర్ ఈ మూడు థియేటర్ లలో ఈ నెల 14 న తేదీన విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా హీరో మాట్లాడుతూ సస్పెన్స్ యాక్షన్ థ్రిల్లర్ లవ్ కంటెంట్తో ఈ సినిమా ఉండబోతుందని, ఈ సినిమాని థియేటర్ కు వెళ్లి చూసి ప్రతి ఒక్కరు ఆదరించాలని కోరారు. అన్ని సినిమాల లాగా రెగ్యులర్ గా కాకుండా ఒక కొత్త కంటెంట్ తో సినిమా తీశామని తెలిపారు.అలాగే ఈ చిత్రాన్ని ఘనవిజయం చేయాలని కోరారు. ఈ చిత్రం ఘనవిజయం అయిన తరువాత ఆంధ్ర, తెలంగాణలో అన్ని థియేటర్లలో విడుదల చేస్తామని హీరో తెలిపారు. ఈ చిత్రం ప్రమోషన్స్ లో భాగంగా సినిమా యూనిట్, సినీ అభిమానులు పాల్గొన్నారు.

## సాగులో అధిక రసాయనాలు వాడరాదు

**ఘంటసాల, మేజర్ న్యూస్ :** ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం లో బుధవారం జాతీయ సహకార అభివృద్ధి సంస్థ సహకారంతో జీవ నియంత్రణ పద్ధతులు, సమగ్ర చీడ పురుగుల యాజమాన్యంపై శిక్షణ నిర్వహించారు. సమన్వయకర్త డా సుధా రాణి మాట్లాడుతూ పంటల సాగులో అధిక మోతాదులో రసాయన మందులు యెక్కువ కలిపి పిచికారీ చేయడంతో సాగు ఖర్చు అధికమవడం మేకాక రసాయన వినియోగ సామర్థ్యం తగ్గుతుందని, పురుగుల్లో పురుగు మందును తట్టుకునే శక్తి పెంపొందుతుందన్నారు. సేంద్రీయ పంటలను సాగు చయడంతో పంట ఉత్పత్తులు పొందవచ్చున్నారు. జీవ నియంత్రణ పద్ధతులలో భాగంగా ట్రైకోగ్రామ గుడ్డు పరాన్నజీవుల వినియోగం, లింగాకర్షక బుట్టలు వినియోగం ద్వారా పురుగు ఉనికి, ఉధృతి సస్యరక్షణ చర్యలను ప్రణాళిక చేసుకోవచ్చు ఆమె తెలిపారు.వరిలో ఎలుకల యాజమాన్యంలో బ్రోమోడయలోన్ విషపు ఎర తయారీ విధానం పాటించాల్సిన మెళకువలను, నైపుణ్యత ప్రదర్శన తెలియచేశారు. ఏ ఎఫ్ సి ఓ ఎఫ్ ఎం డి సురేష్ కుమార్, సహకార సంస్థ రీజనల్ డైరెక్టర్ స్నేహంషు గోస్వామి, సిబ్బంది వేదాంత రెడ్డి, శివ రామ కృష్ణ, కేవికే శాస్త్రవేత్తలు రేవతి, వెంకటలక్ష్మి రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నిమోనియాను రూపు మాపాలని ర్యాలీ



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** జిల్లా వైద్యాధికారి డాక్టర్ పి యుగంధర్ ఆదేశాలను మేరకు పిహెచ్సీ ఘంటసాల వైద్యాధికారులు డాక్టర్ టి.వెంకటేశ్వరరావు, వి ప్రమోద్ కుమార్ ల ఆధ్వర్యంలో పిహెచ్సి సూపర్వైజర్ ఎం శివకృష్ణ స్టాఫ్ ఫీల్డ్ స్టాఫ్ ఆధ్వర్యంలో సమక్షంలో ర్యాలీ, మీటింగు నిర్వహించారు. శాన్ ప్రోగ్రాం గూర్చి ఏ.ఎన్.ఎం ల కి, ఎం. ఎల్. హెచ్. పి. ల కి, ఆశాలకు అవగాహన కల్పించారు. ఆశాలు ఏఎన్ఎంస్ తన ఏరియాలో ఉన్న 0 నుంచి 5 సం" లో పిల్లలకి నిమోనియా లక్షణాలు అనగా జ్వరము బరువు తగ్గటం దగ్గు జలుబు శ్వాస తీసుకోవడం ఇబ్బంది ఉన్న పిల్లలను గుర్తించి పిహెచ్సిలో ఉన్న దగ్గరలో ఉన్న పీహెచ్సీకి రిఫర్ చేయాలని తెలిపారు

## ధాన్యం కొనుగోలులో సమస్యలు రాకుండా చూడండి

**పెదపారుపూడి మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన పెదపారుపూడి గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు నేస్తాలుగా రైతు సేవా కేంద్రాలు పనిచేయాలని, ధాన్యం కొనుగోలు విషయంలో ఎటువంటి సమస్యలు రాకుండా చూడాలని కోరారు. రైస్ మిల్లర్లు, రైతుల మధ్యలో ధాన్యం తేమ శాతంలో తేడా వస్తే కస్టోడియన్ ఆఫీసర్ బాధ్యతలు తీసుకొని రైతు సేవా కేంద్రం లో వచ్చిన తేమ శాతాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ధాన్యం కొనుగోలు విధానంలో దళారుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా ఉండాలని, ధాన్యం కొనుగోలుకు గోనెనె సంచుల కొరత లేకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఎటువంటి అవకతవకలు జరిగినా ఉపేక్షించేది లేదని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజా తో పాటు రాష్ట్ర గౌడ సంక్షేమ - అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, గ్రామ సర్పంచ్ సమీర లతో పాటు పలువురు రైతులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సరోజినికి నివాళులర్పించిన ఎమ్మెల్యే తదితరులు

**పెదపారుపూడి మేజర్ న్యూస్:** పెదపారుపూడి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి (చంటి) తల్లి సరోజిని పెదకర్మ కార్యక్రమం మండల పరిధిలోని వెంట్రప్రగడ గ్రామంలో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా, రాష్ట్ర గౌడ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, శాసన మండలి మాజీ సభ్యులు వైవిబి రాజేంద్రప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొని సరోజిని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించా రు. ఈ సందర్భంగా చంటి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో విజిలెన్స్ వారోత్సవాలు

**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో చల్లపల్లి జడ్పీ హైస్కూల్లో బుధవారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా మచిలీపట్నం రీజినల్ ఆఫీస్ హెడ్ కె. వెంకటరావు, రీజినల్ విజిలెన్స్ ఆఫీసర్ కె.వెంకటరాజు, చల్లపల్లి బ్యాంకు మేనేజర్ వెంకట్లు కార్యక్రమంలో పాల్గొన్నారు. విజిలెన్స్ వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా రీజినల్ హెడ వెంకటరావు మాట్లాడుతూ, విద్యార్థులునిబద్ధత, నిజాయితీని అలవరచుకోవాలనీ, శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థి దశ నుంచే మంచి నడవడికను అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎం. రాజా, ఉపాధ్యాయులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

# స్వచ్ఛ ఓటర్ల జాబితా తయారీకి సహకారం అందించాలి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలో స్వచ్ఛ ఓటర్ల జాబితా తయారీ, అదనపు పోలింగు కేంద్రాల ఏర్పాటుకు రాజకీయ పార్టీలు సహకారం అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కోరారు. బుధవారం సాయంత్రం ఆయన కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల నమోదు అధికారులు ఈఆర్ఓ, ఎన్నికల డీటీలతో స్వచ్ఛ ఓటర్ల జాబితా తయారీ, అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సమస్యలు తదితర ఎన్నికల సంబంధిత అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరించి జిల్లాలో స్వచ్ఛ ఓటర్ల జాబితా తయారీకి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులకు సంబంధించి అంశాలు ఏవైనా ఉంటే రాజకీయ పార్టీల ప్రతినిధులు జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకురావాలన్నారు. ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ, క్లెయిమ్ లు, అభ్యంతరాల పరిష్కారం, అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, మార్పులు చేర్పులు వంటి అంశాలపై తగిన సలహాలు, సూచనలు అందించాలని కోరారు. ప్రస్తుతం ఈ నవంబర్ 11 నాటికి మార్పులు, చేర్పులు చేపట్టిన అనంతరం జిల్లాలో మొత్తం 15,45,021 మంది ఓటర్లు ఉండగా వారిలో 7,48,208 మంది పురుషులు, 7,96,762 మంది స్త్రీలు, 51 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఉన్న 1,769 పోలింగ్ కేంద్రాలకు అదనంగా మరో 73 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘం రూపొందించిన నిబంధనల ప్రకారం ప్రతిపాదించినట్లు తెలిపారు. వీటిపై అభ్యంతరాలు సలహాలు సూచనలు తెలియజేయాలని రాజకీయ పార్టీలను కోరారు. భవిష్యత్తులో ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు వీలుగా ఆయా రాజకీయ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్ లు (బి ఎల్ ఏ) నియమించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖరరావు, మచిలీపట్నం, గుడివాడ ఆర్డీఓలు కే స్వాతి, జి బాలసుబ్రమణ్యం, ఎన్నికల నమోదు అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పీవీ గజేంద్రరావు, దిలీప్ కుమార్, బత్తిన దాసు, షేక్ సిలార్ దాదా, అబ్దుల్ మతీన్, కొడాలి శర్మ, ఎస్. బాలాజీ,ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## నీతి నిజాయితీలతో కష్టపడి పార్టీ కోసం పనిచేసే వారికి పదవులు వెతుక్కుంటూ వస్తాయి

కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, రొండి కృష్ణ యాదవ్.

మచిలీపట్నం మేజర్ న్యూస్ : నీతి నిజాయితీలు, పార్టీ కోసం కష్టపడి పని చేసే వారికి పదవులు వస్తాయి అనడానికి నిదర్శనమే పి. వి. ఫణి కుమార్ కు బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్లో రాష్ట్ర డైరెక్టర్ పదవి రావడం అని, కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, రొండి కృష్ణ యాదవ్ అన్నారు.పి. వి. ఫణి కుమార్ కు బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్లో రాష్ట్ర డైరెక్టర్ పదవి వచ్చిన సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, రొండి కృష్ణ యాదవ్ ఆయన కార్యాలయంలోపి. వి. ఫణి కుమార్ ను అభినందించి ఘనంగా బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా రొండి కృష్ణ యాదవ్ మాట్లాడుతూ.పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసిన వ్యక్తిపి. విఫణి కుమార్ అన్నారు.కులమతాలకు అతీతంగా సేవలందించే వ్యక్తి అని, అలాంటి వ్యక్తికి బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్లో ప్రభుత్వపరంగా రాష్ట్ర డైరెక్టర్ పదవి రావడం పట్ల అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు అన్నారు.నీతి నిజాయితీతో ప్రజలకు సర్వీస్ అందించే పి. వి. ఫణి కుమార్ మచిలీపట్నంలో తెలుగుదేశం పార్టీ కోసం ఎంతో కష్టపడి పని చేశాడని, అతని కష్టాన్ని గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి, పవన్ కళ్యాణ్, మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి లు బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ లో రాష్ట్ర డైరెక్టర్ పదవిపి. వి. ఫణి కుమార్ కు ఇచ్చినందుకు వారికి అన్ని వర్గాల ప్రజల నుండి కృతజ్ఞతలు, ధన్యవాదములు తెలుపుతున్నాము అన్నారు.ముఖ్యంగా పి. వి. ఫణి కుమార్ తన పదవికి న్యాయం చేసేలా రాష్ట్రంలో ఎంతోమంది నిరుపేద బ్రాహ్మణులకు అండగా నిలబడి వారికి ప్రభుత్వపరంగా అందే పథకాలను అందజేయాలని పి. వి. ఫణి కుమార్ కు సూచించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు, వాలిశెట్టి తిరుమలరావు, యాదవ సంఘం అధ్యక్షుడు, చినబాబు, హరిబాబు, జనసేన నాయకుడు,వాలిశెట్టి మల్లి, మాజీ కౌన్సిలర్, నాలి మాధవ తదితరులు పాల్గొన్నారు.

## దత్తాత్రేయను ఆహ్వానించిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** గాంధీ క్షేత్రంలో జరిగే దివిసీమ ఉప్పెన స్మారక సభకు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆహ్వానించినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం హైదరాబాదులోని వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసిన మండలి ఈ నెల 19వ తేదీ అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో జరిగే 48వ దివిసీమ ఉప్పెన స్మారక సభకు ఆహ్వానించారు. ఉప్పెన ప్రభావిత గ్రామాలకు ఆనాడు దత్తాత్రేయ చేసిన సహాయం అపూర్వమన్నారు. ఈ సందర్భంగా ఆయనను మర్యాదపూర్వకంగా సత్కరించినట్లు తెలిపారు.

## జన్మదినాన్ని పురస్కరించుకొని పలు సేవా కార్యక్రమాలు.



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కొందరు డబ్బు సంపాదించడ మే ధ్యేయంగా పెట్టు కుని డబ్బు సంపాదిం చిన ఏ ఒక్కరికి కూడా సహాయం చేసి ఆదుకోరు. మరి కొందరు సంపాదించిన దాంట్లో కొంత పేదలకు పలు రకాలుగా సేవలందిస్తారు. తాము పుట్టినరోజున దానధర్మాలు చేయడమే కాకుండా పలువురికి ఉపయోగం కలిగించే కార్యక్రమాలు చేస్తూ అందరి అభినందనలను చూరగుంటారు. అటువంటి వారిలో దోమల చిన్నం నాయుడు కుటుంబం ఒకటి. ప్రతి సంవత్సరం తన పుట్టినరోజును పురస్కరించుకుని ఉన్న దాంట్లో సహాయ సహకారాలు అందిస్తూ ఉంటారు చిన్నం నాయుడు. బుధవారం తాను పుట్టిన 49వ సంవత్సరాన్ని పలువురు బంధువులు, స్నేహితుల మధ్య మచిలీపట్నం ఓల్డ్ హౌసింగ్ బోర్డ్ కాలనీలోని తన స్వగృహంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి పలువు రేవకులు విచ్చేసి రక్తదానం చేశారు. మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి చెందిన డాక్టర్ల బృందం వచ్చి రక్తాన్ని సేకరించారు. పలువురు పేదలకు నిత్యవసరాలైన కందిపప్పు నూనె ప్యాకెట్ చింతపండు మినప్పప్పు పంచదార సబ్బులు తదితర వస్తువులను ఉచితంగా అందజేశారు. పెద్ద ఎత్తున జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర శిష్టికర్ణాల అధ్యక్షుడు అక్కుమంతి రాజా, మచిలీపట్నం అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ వంపుగడవల చౌదరి, దోమన చిన్నం నాయుడు, ఆయన భార్య నాగదేవి కుమారులు కుమార్తె మనీష్ మౌళి రక్షిత లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నం నాయుడు మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుంచి తన పుట్టినరోజు ను పురస్కరించుకొని అన్నదానం నిత్యవసరాలు అందిస్తున్నామన్నారు రెండు సంవత్సరాల నుండి రక్తదాన శిబిరాలు కూడా ఏర్పాటు చేస్తూ తన వంతు సహాయ సహకారాలు, అందిస్తున్నామన్నారు చిన్నం నాయుడు అందిస్తున్న సేవా కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకొని పలువురు ముందుకొస్తే మరి కొందరికి ఆదర్శంగా నిలుస్తారు.

## పేకాట శిబిరం పై దాడులు



**ఏ. కొండూరు, మేజర్ న్యూస్:** మండలంలోని కోదూరు, అట్ల ప్రగడ, గ్రామ సమీపంలో పేకాట, జూదం నిర్వహిస్తున్న శిబిరాలపై బుధవారం దాడులు నిర్వహించి కేసులు నమోదు చేసినట్లు ఎస్సై జి మహాలక్ష్మయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో ఎవరైనా జూదాలు, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించిన చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. పేకాట శిబిరాలపై దాడులు నిర్వహించడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఏ కొండూరు ఎస్సై మహాలక్ష్మయుడు మరియు సిబ్బంది కానిస్టేబుల్స్ బాబురావు, సుభాని, తిరుపతిరావు లను మైలవరం ఏసిపి అభినందించారు.

## సాన్స్ పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ డీ కే బాలాజీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** బుధవారం కలెక్టరేట్ ఛాంబర్లో, జిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ యుగంధర్,ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ ప్రేమ్ చంద్, జిల్లా ప్రోగ్రాం అధికారులు, ఇతర జిల్లా అధికారుల సమక్షంలోసాన్స్ కార్యక్రమం పోస్టర్ ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యంశిశువులలో న్యుమోనియా వ్యాధి నివారణ, త్వరిత గుర్తింపు, సమయానుకూల వైద్యం,, తల్లిదండ్రులలో అవగాహన పెంపు పై దృష్టి సారించడం.ఈ సాన్స్ కార్యక్రమం 12 నవంబర్ 2025 నుండి 28 ఫిబ్రవరి 2026 వరకు కొనసాగుతుంది. ఈ కాలంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ఆరోగ్య కేంద్రాలు పి హెచ్ సి ఎస్, సి హెచ్ సి ఎస్, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారాశిశు శ్వాస సంబంధిత వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు,శిక్షణలు, వైద్య శిబిరాలు నిర్వహించబడతాయి.పి సి వి యొక్క ప్రాముఖ్యతను వివరించారు.ఈ టీకా ద్వారా శిశువులను న్యుమోనియా, దాని వల్ల కలిగే తీవ్రమైన సంక్లిష్టతల నుండి రక్షించవచ్చని తెలిపారు.తల్లిదండ్రులు తమ పిల్లలకు సమయానికి పి సి వి టీకా సహా అన్ని రొటీన్ ఇమ్యూనైజేషన్ టీకాలు ఇవ్వడం చాలా అవసరం అని ఆయన సూచించారు. జిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ మాట్లాడుతూ, న్యుమోనియా అనేది శిశువుల ప్రాణాలను ప్రమాదంలోకి నెడగల వ్యాధి. తల్లిదండ్రులు తమ పిల్లలలో శ్వాసకోశ సమస్యలను ముందుగా గుర్తించి, సమయానుకూలంగా వైద్యసేవలు పొందడం అత్యంత అవసరమని పేర్కొన్నారు.

## సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతము



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** బచ్చుపేట శ్రీ భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వారి వ్రతము వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసం పర్వదినం సందర్భంగా సుమారు 170 మంది దంపతులకు పైన సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతము ఆచరించుకొని కార్తీక వన సమారాధన చేశారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి గోవాద వెంకటకృష్ణారావు, ముత్తేవి రవికాంత్, శశికాంత్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను తిలకించారు. అనంతరం కార్తీక వన సమారాధన జరిగింది. అలాగే స్వామివారి సన్నిధిలో ఈ నెల 18వ తేదీన మాస శివరాత్రి సందర్భంగా సాయంత్రం 6 గంటలకు కోటి దీపోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శశికాంత్ తెలిపారు.

## గోడ పత్రికను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** బుధవారం కలెక్టరేట్ లోని చాంబర్లో సహకార శాఖ వారి 72వ అఖిల భారత సహకార వారోత్సవముల సందర్భంగా గోడ పత్రికను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆవిష్కరించారు. జిల్లా సహకార శాఖ అధికారి కే. చంద్రశేఖర్ రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు

## ప్రజా ఆరోగ్య భద్రత, కల్తీ లేని ఆహారమే లక్ష్యంగా చట్టాలపై ప్రజలకు అవగాహన ఉండాలి




**కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ :** దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి. సి సి సి సౌత్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఆహార భద్రత, కల్తీ అంశాలపై వినియోగదారుల అవగాహన సదస్సు మచిలీపట్నంలో జరిగింది, బి ఐ ఎస్, ఎఫ్ ఎస్ ఎస్ ఎ ఐ చట్టాల పనితీరు, వాటి యొక్క లక్ష్యాలు వినియోగదారుల హక్కుల గురించి చర్చించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎ జి పి యర్రంశెట్టి వెంకట నాగభూషణరావు,దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చైర్మన్ డా.మేడా రామకృష్ణ, రాష్ట్ర వైస్ చైర్మన్ గంగిశెట్టి బాబు రాజేంద్రకుమార్, రాష్ట్రకార్యదర్శి పి. దిలీప్ సాయి,గుంటూరు జిల్లా చైర్మన్ ఆర్ కె చౌదరి, కృష్ణాజిల్లా ట్రెజరర్ చలమలశెట్టి వెంకటరావు,జిల్లా వైస్ చైర్మన్లు యడ్లపల్లి లక్ష్మణరావు,వెంట్రపాటి రవికాంత్, జనరల్ సెక్రటరీలు గుంటూరు విజయకుమార్, పుట్టి ఉమామహేశ్వరరావు, సెక్రటరీలు మట్టా రమేష్ బాబు, చింతగుంట తనోజ్, స్థానిక వినియోగదారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# కష్టాల్లో ఉండి సహాయం అర్ధించిన వారికి చేతనైన సాయం చేయండి

**రాజకీయం అంటే మన ప్రాంత అభివృద్ధి కోసం, ప్రజలకు మేలు చేయడం కోసమే...**

**మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్**



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** కష్టాల్లో ఉండి సాయం కోసం అర్ధించిన వారికి చేతనైన సాయం చేయాలని, రాజకీయం అంటే మన ప్రాంత అభివృద్ధి, మనల్ని నమ్ముకున్న ప్రజలకు మేలు చేయడం కోసమేనని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. జి.కొండూరులో బుధవారం జరిగిన మైలవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవ సభలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ యువ నాయకత్వంలో వస్తున్న మార్పులను అందరూ గమనించాలని అన్నారు. ఎన్టీఆర్ బలమైన ముహూర్తంలో తెలుగుదేశం పార్టీని స్థాపించారని అన్నారు. ఆతర్వాత సీఎం చంద్రబాబు అనితర సాధ్యుడు నాలుగు పర్యాయాలు సీఎం అయ్యి భారతదేశంలో తెలుగుదేశం పార్టీని ఒక స్థాయిలో నిలబెట్టారని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ అంటే భారతదేశంలో అత్యంత నిర్మాణాత్మకమైన, క్రియాశీలకమైన క్రమశిక్షణ గల పార్టీగా సీఎం చంద్రబాబు నిరూపించారని పేర్కొన్నారు. నేడు తాతకు మించి, తండ్రికి మించి మంత్రి నారా లోకేష్ పార్టీని నడిపిస్తున్న తీరును గుర్తించి, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రత్యేకంగా కుటుంబంతో ఆహ్వానించి ఆయన్ని ప్రశంసించారన్నారు. దీన్ని బట్టి నారా లోకేష్ సత్తాను అందరూ గమనించాలని అన్నారు. పార్టీ పదవులను అన్ని విషయాలను, అంశాలను పరిగణనలోకి తీసుకుని కేటా యించినట్లు వెల్లడించారు. గతంలో పార్టీ కోసం అంకిత భావంతో పని చేసిన వారందరికీ ఇతరత్రా పదవుల్లో తగిన ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. మైలవరం నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి విషయంలో ఎక్కడా నిర్లక్ష్యం లేదన్నారు. ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన ట్లు వెల్లడించారు. అతిత్వరలోనే వాటికి అనుమతులు లభిస్తాయన్నారు. ప్రాధాన్యత క్రమంలో ఒక్కో రోడ్డు అభివృద్ధి జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి కింద ఇప్పటికే 16 నెలల కూటమి ప్రభుత్వ హయాంలో దాదాపు 11 కోట్ల రూపాయలకు పైగా మంజూరు చేయించినట్లు వెల్లడించారు. కష్టాల్లో ఉండి సాయం కోసం అందించిన వారికి చేతనైన సాయం చేయాలని అన్నారు. సీఎం చంద్రబాబు 75 ఏళ్ళ వయస్సులో నిరంతరం రాష్ట్ర ప్రగతి కోసం కష్టపడుతున్నారన్నారు. అప్పులు లేకుండా ఆదాయం సృష్టించి సంక్షేమ పథకాలు అమలు చేయడమే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. మంత్రి నారా లోకేష్ మన రాష్ట్రంలో పరిశ్రమలను స్థాపించి విస్తృతంగా ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తున్నారన్నారు. మైలవరం నియోజకవర్గ ప్రజల సంక్షేమం, సమగ్రాభివృద్ధికి తను కట్టుబడి ఉన్నట్లు మరోమారు స్పష్టం చేశారు. పార్టీ పదవులు, ఇతరత్రా పదవులు క్రమాణుగుణంగా, ప్రాధాన్యతా క్రమంలో లభిస్తాయని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అందరూ ఐకమత్యంగా ముందుకు సాగాలని అన్నారు. ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షులు, కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాం, నూర్ భాషా, దూదేకుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు, మైలవరం నియోజకవర్గ పార్టీ పరిశీలకులు ధారునాయక్, తెలుగుదేశం పార్టీ నాయకులు, తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

# వేగవంతంగా ఆధార్ సేవలు



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** ఇక నుంచి ఆధార్ సేవలు సర్వర్ సమస్యలు లేకుండా వేగవంతంగా అందించబడతాయని మచిలీపట్నం డివిజన్ పోస్టల్ జోన్ సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం ఆయన చల్లపల్లి పోస్టాఫీసును ఆకస్మిక తనిఖీ చేశారు. ఖాతాదారులు, ప్రజలతో మాట్లాడి ఇక్కడి పోస్టాఫీసులో అందుతున్న సేవలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఉద్యోగుల పనితీరు, వారు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు కొన్ని ఆధార్ ఎంట్రీలను దగ్గరుండి పరిశీలించారు. ఈసందర్భంగా సూపరింటెండెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గత రెండు రోజుల నుంచి ఆధార్ సేవలు అందించటంతో సర్వర్ సమస్యలు తలెత్తుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని అందుకే ఆకస్మిక తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. సర్వర్ లోపాలు అన్నింటినీ సరిచేశామని ఇక నుంచి యథావిధిగా వేగవంతంగా ఆధార్ సేవలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని వివరించారు. అలాగే పోస్టాఫీసుల్లో అందిస్తున్న ఇతర పథకాలు. సేవలను కూడా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే పోస్టాఫీసుల్లో మాత్రమే లభ్యమయ్యే గ్రూప్ యాక్సిడెంటల్ గార్డ్ పాలసీ(జిఎజిపి) ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. కేవలం రూ. 799లు కట్టి తీసుకోవటం వల్ల ప్రమాదంలో మరణిస్తే రూ. 15 లక్షల వరకూ. అలాగే గాయాలై ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటే రూ.1లక్ష వరకూ భీమా అందుతుందని వివరించారు. అలాగే ఆర్పిఎలిఐ ద్వారా తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్సు పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయసతపాటు పోస్టాఫీసు సిబ్బంది ఉన్నారు.

# ప్రతి ఒక్కరికి గృహ నిర్మాణమే లక్ష్యం : ఎమ్మెల్యే కుమార్ రాజా



**పామర్రు మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ఇల్లు ఉండాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఉందని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. పామర్రు టౌన్ ఇందిరా నగర్ లో ప్రధానమంత్రి ఆవాస యోజన(పిఎంఎవై) పథకం ద్వారా లబ్ధిదారు – ఈసాని జ్యోతి నూతన గృహప్రవేశ వేడుకలో ఆయన పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 17 నెలల కాలంలోనే రాష్ట్రంలో దాదాపు మూడు లక్షల ఇళ్లకు పైగా నిర్మించి బుధవారం గృహప్రవేశ కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా నియోజకవర్గంలో 731 గృహాలను నిర్మించడం జరిగిందన్నారు. గృహాలను నిర్మించుకున్న వారి కుటుంబాలలో కనిపిస్తున్న ఆనందం తమకు ఎంతో సంతృప్తిని కలిగిస్తోందన్నారు. రానున్న ఐదు సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో ఇల్లు లేని వారు ఉండకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నారని, అందుకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా ప్రతి ఒక్కరికి పక్కా గృహాలను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం నూతన గృహ నిర్మాణానికి 2.50 లక్షలు రూపాయలు అందిస్తోందని బిసి, ఎస్సీలకు మరో 50 వేలు, ఎస్టీలకు 75వేల రూపాయల వంతున అదనంగా అందిస్తున్నట్లు చెప్పారు. ఇవి కాక డ్వాక్రా మహిళలకు లక్ష రూపాయలు రుణ సదుపాయాన్ని కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఇంటి స్థలం ఉన్న ప్రతి ఒక్కరు వినియోగించుకుని పక్కా గృహాలను నిర్మించుకోవాలని ఆయన కోరారు. ఇందుకు సంబంధించి దరఖాస్తులను గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలో గాని లేదా నేరుగా స్థానిక శాసనసభ్యుల వారి కార్యాలయం లో గాని అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజా తో పాటు తూర్పు కృష్ణాడెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూ రుపల్లి గణేష్, గృహ నిర్మాణ శాఖ డిఇఇ కె.శివప్రసాదరావు, నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల ఏఈలు పవన్ కళ్యాణ్ (పామర్రు), వంశీ నాంచారయ్య (మొవ్వ), నాగబాబు(తోటవల్లూరు), ఫణీంద్ర (పెదపారుపూడి), నరేంద్ర(పమిడిముక్కల), గృహనిర్మాణ శాఖ సిబ్బంది, తెలుగుదేశం పార్టీ నాయకులు చాట్ల రమేష్, మంతెన రామాంజనేయులు, పానుగంటి సందీప్, వీరంకి వెంకటేశ్వరరావులతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

## కుంటముక్కల్లో మెగా పశువుల మెడికల్ క్యాంపు



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** కుంటుముక్కల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో కుంటముక్కల గ్రామంలోని పశువుల హాస్పిటల్‌లో పశువులకు మెగా మెడికల్ క్యాంపు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ అధ్యక్షులు సుఖవాసి శ్రీహరి నీటి సంఘం అధ్యక్షుడు కొమ్మవరపు వెంకటేశ్వరరావు,మందడ లక్ష్మణరావు, లంక నాగేశ్వరావు, మన్నం నాగేశ్వరావు, సొసైటీ కార్యదర్శి కిషోర్, సిబ్బంది, పశువర్ధక శాఖ సిబ్బంది అసిస్టెంట్ డైరెక్టర్ హరి హరినాథ్, మండల పశువర్ధక అధికారి వి శ్రీకాంత్, కుంటముక్కల పశువర్ధక శాఖ అధికారి సిహెచ్ దుర్గా మహేష్ పాల్గొన్నారు. ముఖ్యంగా ఈ కార్యక్రమంలో పశువులకు సంబంధించిన గర్భకోశ వ్యాధులు అవగాహన కల్పించి మందులు అందజేశారు.

## యూట్యూబ్ ఛానల్‌కు అక్రిడేషన్ ఇవ్వాలి

**మంత్రి నారా లోకేష్‌కు ఆదం న్యూస్ సిఈవో ఆదాం విజ్ఞప్తి**



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** నిత్యం ప్రజా సేవలో పనిచేస్తూ ప్రజలకు ప్రభు త్వానికి వారధులుగా పనిచేస్తున్న యూ ట్యూబ్ ఛానల్స్ సైతం అక్రిడేషన్ మం జూరు చేయాలని. వారిని కూడా జర్నలి స్టులుగా గుర్తించాలని మంత్రి నారా లోకేష్‌కు ఆదామ్ న్యూస్ సిఈవో ఆదాం విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పాదయాత్ర సమయంలో నారా లోకేష్ యూట్యూబ్ ఛానల్స్‌కు అక్రిడేషన్ ఇస్తానని హామీ ఇచ్చిన సంగతిని గుర్తు చేశారు. నూతన అక్రిడేషన్ల కి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి విదితమే. ఆన్లైన్ ప్రక్రియ ద్వారా అక్రేషన్లు జారీ చేయనున్నారు.

## అంబాపురంలో మెగా పశువుల మెడికల్ క్యాంపు..



**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామంలో జరిగిన పశుసంవర్ధక శాఖ విజయవాడ డివిజన్, పశుగణాభివృద్ధి సంస్థ గన్నవరం ఆధ్వర్యంలో గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం అంబాపురం రైతు సేవ కేంద్రంలో నిర్వహించడం జరిగింది. ఈ శిబిరంలో ముఖ్యంగా చులుకట్టని, తిరిగిపోర్లే పశువులకు పరీక్షలు నిర్వహించి వైద్యం అందించడం జరిగింది. మొత్తం 150 పశువులు,100 గొర్రెలు, కోళ్లకు పరీక్షలు చేయటం జరిగింది. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ గండికోట సీతయ్య ప్రారంభించి,పశువులకు మినరల్ మిక్చర్ అందించారు. సర్పంచ్ సీతయ్య మాట్లాడుతూ పశువులకు,గొర్రెలకు,కోళ్లకు ఎటువంటి వ్యాధులు సోకకుండా గ్రామంలో ఉన్న రైతులందరూ కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యాధుల బారిన పడిన పశువులకు మందులు తీసుకొని వాటికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచ్ సీతయ్య చెప్పారు. ఈ కార్యక్రమంలో విజయవాడ డివిజన్ సహాయక సంచాలకులు డాక్టర్ సునంద,గన్నవరం పశుగణాభివృద్ధి సంస్థ పశు వైద్యురాలు డాక్టర్ రాధిక, గొల్లపూడి గ్రామ పశు వైద్యుడు డాక్టర్ పంకజ్ పటేల్, పశుసంవర్ధక సహాయకులు నాగేంద్రబాబు,ఇస్సాకు,రవి,ప్రభంజన్, గోపి,తదితరులు పాల్గొన్నారు.


విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు నందిగామ టౌన్, నందిగామ రూరల్, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో

ఫోన్ : 9642 980 999